# బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్


ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్:** మోసపూరిత హామీలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందని.. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ రోడామేస్త్రీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో వినయ్, వేణు, గోపాల్, ఆనంద్ తమ మిత్ర బృందంతో కలిసి బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబమే బాగు పడిందని ఆరోపించారు. సామాన్య ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు సైతం బీఆర్ఎస్ పార్టీ విధేయులకే ఇచ్చారని విమర్శించారు.

**ప్రాజెక్ట్‌ల పేరుతో రూ.కోట్లు దండుకుంటున్నారు..**

నేడు మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్‌లు కూలిపోయే స్థితికి వచ్చాయని... దీనంతటికి కేసీఆర్ అవినీతి పాలనే కారణమని దుయ్యబట్టారు. ప్రాజెక్ట్‌ల పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, కూన జగన్, సత్యం, సంతోష్, గుండప్ప, చెన్నమ్మ, మాడప్ప, అశోక్ పాల్గొన్నారు.

- నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో జోరుగా ప్రచారం
- కూన సమక్షంలో పెద్ద ఎత్తున పార్టీలో చేరిన యువత
- కొత్తగా చేరిన వారు పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి
- ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలని కార్యకర్తలకు సూచన

**పార్టీలో చేరిన మార్కండేయనగర్ యువత**

సూరారండివిజన్‌లో మార్కండేయనగర్‌కు చెందిన స్థానిక యువ నాయకులు మాసాని రమేష్, ఉడుత రవి ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ వారిని పరిచయం చేసుకుని ముచ్చటించారు. అనంతరం బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ విజయానికి సైనికుడిలా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. రాజు, మల్లేష్, విజయ్, భాస్కర్, శ్రీధర్, రవి, టింకు, సోనాలి, రవి, విజయ్, శ్రీను, కిట్టు, పవన్, భరత్, మహేష్, శ్రీకాంత్, శివ, నారాయణ, తుకారాం, భరత్, ప్రవీణ్, మంజుల, నాగమణి, స్వరూప, లక్ష్మి, విజయ, అరుణ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, దుర్యోధనరావు బావిగడ్డ రవి, పత్తి రఘుపతి, దీపక్ అంబేకర్, రాజేష్ మిశ్రా, సంతోష్ గుప్తా పాల్గొన్నారు.

**ఓటర్లు పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలి**

జీడిమెట్ల డివిజన్ బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పులి బలరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, భరతసింహారెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అమ్మా.. నీ ఆశీర్వాదం కావాలి**


ప్రచారంలో వృద్ధురాలితో ముచ్చటించి ఆశీర్వాదం తీసుకుంటున్న శ్రీశైలంగౌడ్


జీడిమెట్ల డివిజన్ కార్యకర్తల సమావేశంలో..



బీజేపీలో చేరిన మార్కండేయనగర్, రోడామేస్త్రీనగర్‌లకు చెందిన యువతతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

# కబ్జాదారుల కట్టడికి 'పోలీసుల సహకారం'

- చర్యలు తీసుకోవాలని పోలీసులకు లేఖ రాసిన రెవెన్యూ అధికారులు


అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం (ఫైల్)

**కుత్బుల్లాపూర్:** గాజులరామారం పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కట్టడి చేసే విషయంలో కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయం తీసుకుంటున్నారు.. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా తహసీల్దార్ రెహమాన్‌తో పాటు పలువురు సిబ్బంది ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటంతో గాజులరామారం సర్వేనం. 329, 342/1, 307 ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. స్థానికంగా కబ్జాదారులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సందర్భాలు ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌కు లేఖ రాశారు.

- కబ్జాదారులను కట్టడి చేసి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని లేఖ రాయడంతో పోలీసులు పలువురు కబ్జాదారులను స్టేషన్‌ను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా ఇప్పటికే భూకబ్జా దారులుగా పోలీసు రికార్డుల్లో ఉన్న రమేష్ నాయక్, శ్రీకాంత్,రాజు, రాములు, ఎస్‌కె ఆబిద్, మురళి, లక్ష్మి, నరసింహ, శ్యామ్, నగేష్, ఇబ్రహీం ఖాన్, ఇస్మాయిల్ ఇలా 12 మందిపై చర్యలకు ఉపక్రమించారు. స్థానికంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే మాత్రం ఊరుకునే సమస్య లేదన్నారు. తప్పకుండా ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని సీఐ క్రాంతి కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

# కాళేశ్వరం నిర్మాణంలో లక్షల కోట్ల అవినీతి

- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

**కుత్బుల్లాపూర్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని.. మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ మూడు పిల్లర్లు కూలిపోవడంపై సీఎం కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హన్మంతరెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై చర్చించడానికి కేసీఆర్ ముందుకు రావాలన్నారు. తొమ్మిదేళ్లుగా అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పే ఆయన అవినీతిపై మాట్లాడాలన్నారు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్‌లకు పగుళ్లు వచ్చి కూలిపోయే స్థితిలో ఉన్నాయన్నారు.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అవినీతిని ఎండగట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించారన్నారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు నీరు అందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామన్నారు. తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నశివారెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.



# ప్రచార రథాలకు డిమాండ్ భళా




**సుభాష్‌నగర్:** ఎన్నికలలో ఓటర్లను తమ వైపు ఆకర్షించేది ప్రచార రథాలు అని చెప్పుకోవచ్చు. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ప్రచార రథాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు లక్షలు వెచ్చించి ప్రచార రథాలను నూతన హంగులతో తయారు చేయించి జనాల మధ్యకు తీసుకెళుతున్నారు. ఈ రతలకు ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకడుగు వేయట్లేదు. దీంతో ప్రచార రతాల తయారీకి భలే డిమాండ్ పెరిగింది. జీడిమెట్ల, దూలపల్లి, సూరారం పారిశ్రామిక వాడల్లో ఉన్న బస్సు బాడీ పరిశ్రమల్లో ప్రస్తుతం ఇతర పనులను పక్కనపెట్టి రాతాల తయారీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. నగరం నుంచి కాకుండా రాష్ట్రం నాలుమూలల నుంచి చిన్నచిన్నల నేతల నుంచి మొదలుకొని బడా నేతల వరకు ఈ ప్రచార రథాలను ఇక్కడి నుంచి తయారు చేయించుకోవడానికి ఆర్డర్లు ఇస్తున్నారు. కొంతమంది నెల ముందే తయారు చేయించుకొని తీసుకెళ్లారని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



**20 రథాలను అందించాం**

మా వద్ద ఇప్పటి వరకు 20 రథాలను ముందస్తుగా తయారు చేయించుకొని తీసుకెళ్లారు. కుత్బుల్లాపూర్ నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి రథాలకు ఆర్డర్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు మా దగ్గర కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్లారెడ్డి, రేవంత్‌రెడ్డిలతో పాటు ఆయా పార్టీల అభ్యర్థులకు రథాలు తయారు చేసి ఇచ్చాం.

– జి .శ్రీనివాస్, శ్రీసాయి దుర్గ ఇండస్ట్రీస్ యజమాని

# హ్యాట్రిక్ సాధించి మరింత అభివృద్ధి చేస్తా

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్


ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని... మరోమారు సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవంబరు 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ఎప్పుడో సిద్ధమయ్యారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలో లేరన్నారు. తాను హ్యాట్రిక్ విజయం సాధించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, సుజాత ల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ తదితరులు ఉన్నారు.

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు**

- జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్, రుద్రా అశోక్‌ల ఆధ్వర్యంలో మైసమ్మనగర్ బీ-బ్లాక్‌కు చెందిన టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లింగల జైకృష్ణ, గోపాల్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, ఎత్తరి మారయ్య, కృష్ణగౌడ్, హనుమంతు, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.
- బీఎస్ఎన్ఎల్ మాజీ టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబర్, మాజీ కౌన్సిలర్ పోపురి అనిత ప్రసాద్ భారీ సంఖ్యలో మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీతాదేవి, లక్ష్మి, ఉమరావత్ దేవి, సీతారత్నం, ధనలక్ష్మి, ఉమా, మరియమ్మ, భాగ్య, హారిక, బుచ్చమ్మ, అనూష, రాణి, కళ్యాణి, పావని తదితరులు పార్టీలో చేరారు.
- సుభాష్ నగర్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శ్రీనివాసరాజు అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శ్రీనివాసరాజు, మురళీకృష్ణరాజు, కిషోర్ అల్లూరి తదితరులు పార్టీలో చేరగా ఎమ్మెల్యే వివేకానంద్ సాదరంగా ఆహ్వానించారు.
- రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీ లో పంచశీల కాలనీ ప్రెసిడెంట్, కపా సుబ్బారెడ్డి గారి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్, ఎమ్మెల్యే వివేకానంద్‌ల సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

**ఎమ్మెల్యేకు మద్దతుగా టూ వీలర్ల అసోషియేషన్లు...**

షాపూర్‌నగర్, కొంపల్లి మున్సిపాలిటీ కేడీబీఎం టూవీలర్ల మెకానిక్ అసోసియేషన్, సుచిత్ర కొంపల్లి టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్, సూరారం టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్, రాయల్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్, కుత్బుల్లాపూర్ టువీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి మద్దతు తెలిపారు. కుత్బుల్లాపూర్ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు షాదుల్లా, సూరారం టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్, రాయల్ టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఫరీద్, షాపూర్‌నగర్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు పరమేష్, కేడీబీఎం టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ. ఖాదీర్, సుచిత్ర కొంపల్లి టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. పాండు రంగారావు తదితరులు ఉన్నారు.

**ఆరెకటిక సంఘం మద్దుతు ఎమ్మెల్యేకే..**

అదే విధంగా ఆరెకటిక సంఘం సంయుక్త సభ్యులు బన్సీలాల్ మోహన్, మనోజ్, సుభాష్, మోహన్ లాల్, పండర్, విజయ్, అశోక్, రాము, సుభాష్ తదితరులు ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు.

**ఐడీపీఎల్‌లో ప్రజా ఆశీర్వాద సభ**

ఐడీపీఎల్‌లోని వైఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో 128వ డివిజన్ ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి, కర్ల కంటి మల్లేష్, మక్సూద్ అలీ, అశోక్, డి.కృష్ణమూర్తి, సంజయ్, ప్రభాకర్ గుప్తా, వరప్రసాద్, పీ.వెంకటేష్‌గౌడ్, శేఖర్‌రావు, కె.సాంబయ్య, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, స్వర్ణలతారెడ్డి, స్వప్న, కె.శ్యామల, స్వర్ణ, మేహరునిస్సా, అభిమానులు పాల్గొన్నారు.


రంగారెడ్డినగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వివేకానంద్


పార్టీలో చేరిన మహిళలకు బీఆర్ఎస్ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలుపుతున్న టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ల సభ్యులు

# రూ.2.3కోట్ల విలువ చేసే మిడాజోలం డ్రగ్స్ స్వాధీనం



**కుత్బుల్లాపూర్:** ఓ పరిశ్రమలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు కోట్ల ముప్పై లక్షల రూపాయలు విలువ చేసే 103.46 కిలోల మిడాజోలం డ్రగ్స్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ విజయ్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రసాద్ ఆదేశాలతో విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవి కాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, మేడ్చల్ సూపరిండెంట్ విజయ్‌భాస్కర్‌ల పర్యవేక్షణలో ఎక్సైజ్ సిబ్బంది దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని గ్లాండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పరిశ్రమపై ఎక్సైజ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పరిశ్రమ ఆవరణలో డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 103.46 కిలోల మిడాజోలం డ్రగ్‌ను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. దానికి సంబంధించిన పత్రాలను పరిశ్రమ యాజమాన్యం చూపకపోవడంతో పంచనామా నిర్వహించి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ డ్రగ్ విలువ రూ.2.37 కోట్ల విలువ ఉంటుందన్నారు. మందుల తయారీలో డ్రగ్స్‌ను వాడుతున్నారా లేదా అక్రమ మార్గంలో డ్రగ్స్ విక్రయాలు చేపడుతున్నారా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ దాడుల్లో మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్‌లు జీవన్ కిరణ్, మాధవయ్య, సీఐలు శ్రీనివాస్, సుభాష్‌చందర్, నర్సిరెడ్డి, యాదయ్య, ఎస్ఐలు కూర్మానాయక్, విష్ణుగౌడ్, సలీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు


ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు చేస్తున్న అధికారులు

**కుత్బుల్లాపూర్:** నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు జరిగే నామినేషన్ల విషయంలో అవలంబించాల్సిన అంశాలపై కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు సంబంధిత అధికారులతో చర్చించారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న కార్యాలయం వద్ద 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ విధించి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ స్వీకరిస్తారని పేర్కొన్నారు.

**నామినేషన్‌కు 24గంటల ముందే బ్యాంకు ఖాతా తెరిచి ఉంచాలి..**

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు, ఇతరులు రూ.10వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలు సమర్పించడానికి 24 గంటల ముందు అభ్యర్థి తన పేరిట బ్యాంకు ఖాతా తెరిచి ఉంచాలని తెలిపారు. ఈ సమయంలో సర్కిల్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డు పూర్తిగా మూసివేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామం మీదుగా అటు షాపూర్ నగర్ జీడిమెట్ల, ఇటు చింతల్ వెళ్లేవారు అటువైపుగా వెళ్లి సహకరించాలని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు.

**ఎక్కడికక్కడే ముమ్మర తనిఖీలు..**

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రధాన చౌరస్తాల వద్ద ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకొని పోలీసులు నిత్యం వాహనాల తనిఖీ చేపడుతూ ఎన్నికల్లో డబ్బు ఖర్చులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సుచిత్ర, బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి, చింతల్, షాపూర్‌నగర్, జీడిమెట్ల, గాజులరామారం, గండిమైసమ్మ, దుండిగల్ బాచుపల్లి ప్రాంతాల్లో ఎన్నికల సిబ్బంది తనిఖీలు చేపడుతూ వస్తున్నారు.

**అభ్యర్థుల ర్యాలీలను వీడియోలో బంధిస్తాం..**



నామినేషన్లు సమర్పించే విషయంలో వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏఆర్వోలు సిబ్బంది చేయాల్సిన ప్రక్రియపై చర్చించాం. అందుకు తగ్గట్టుగా మొత్తం 11 మందికి ఆయా శాఖలను కేటాయించామని తెలిపారు. భారీ ఊరేగింపులు చేసే క్రమంలో వాటి ఖర్చులను చెప్పాల్సిన అవసరం అభ్యర్థులపై ఉంది. ప్రతి అభ్యర్థి ర్యాలీలను వీడియోలో బంధిస్తాం. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. నామినేషన్ల ర్యాలీ సందర్భంగా ఎటువంటి గొడవలకు ఆస్కారం ఇవ్వకూడదు. అభ్యర్థితో సూచించిన వ్యక్తులే నామినేషన్ సమర్పించే కార్యాలయానికి రావాలి.

– పులి సైదులు, కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ అధికారి

# రోడ్డు విస్తరణ పనుల్లో పర్యవేక్షణ లోపం

- కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు

**రంగారెడ్డినగర్:** కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. నాలా ప్రాంతాలలో కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.. కుత్బుల్లాపూర్ చౌరస్తా నుంచి సర్కిల్ కార్యాలయం మీదుగా కుత్బుపూర్ గ్రామం వరకు రూ.2 కోట్ల పైచీలుకు నిధులతో రోడ్డు వెడల్పు చేపట్టి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు.

- ఇంత వరకు బాగానే ఉన్నా సర్కిల్ కార్యాలయానికి సమీపంలో హెచ్ఎంటీ ఖాళీ స్థలం మీదుగా ఉన్న నాలా ప్రాంతంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కల్వర్ట్ నిర్మాణం చేపట్ట లేదు. దీంతో ఈ ప్రాంతానికి రాగానే సగం మేర రోడ్డు కుంచించుకుపోయింది. ఈ ప్రాంతంలో నాలాకు ఆనుకుని ప్లాస్టిక్ కంచెను ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు.
- వాస్తవానికి హెచ్ఎంటీ గోడ వరకు రెండు వైపులా కల్వర్ట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా బిల్లులు సైతం తీసుకోవడం గమనార్హం. దీంతో ఆ ప్రాంతానికి రాగానే రోడ్డు చిన్నదిగా ఉండటంతో వేగంగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించిన నాలా ప్రాంతంలో కల్వర్ట్ వెడల్పు పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.


సర్కిల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో నాలా సమీపంలో ఇరుకుగా మారిన రోడ్డు మార్గం